

రేపు శ్రీశైలంలో కుంభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 24: శ్రీశైలంలో ఈ నెల 26న భ్రమరాంబకు కుంభోత్సవాన్ని నిర్వహించనున్నారు. గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి అమ్మవారికి సాత్వికబలిగా సమర్పించనున్నారు. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో అమ్మవారికి సాత్వికబలి సమర్పించేందుకు పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం ఈ ఉత్సవాన్ని జరపడం ఆనవాయితీ. ఈ మేరకు శుక్రవారం కుంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు.



నిరాహార దీక్ష చేస్తున్న శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగులు (ఫైల్)





- అటకెక్కిన జగన్ హామీలు
- ఐదేళ్లుగా అంతర్గత కుమ్ములాటలు
- అభివృద్ధిని పట్టించుకోని రెండు వర్గాలు



నిండా మునిగిన నందికొట్కూరు

నంద్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు:

'శ్రీశైలం జలాశయం ముంపు వల్ల భూములు కోల్పోయిన నిర్వాసితులకు జీవో 98 ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. కేజీ రోడ్డులో దుకాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తాం. మిడ్తూరు మండలానికి సాగు నీటిని అందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తాం. నందికొట్కూరుకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తాం' 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గానికి వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల చిట్టా ఇది. ఆయన చెప్పిన మాటలకు నియోజకవర్గ ప్రజలు జిల్లాలో ఎవరికీ ఇవ్వని భారీ మెజారిటీని నందికొట్కూరు వైసీపీ అభ్యర్థికి కట్టబెట్టి ఎమ్మెల్యేను చేశారు. ఏరు దాటక బోడి మల్లన్న.. సామెత చందాన అధికారం చేపట్టిన తర్వాత సీఎం జగన్ నందికొట్కూరు వైపు తిరిగి చూడలేదు. నియోజకవర్గం ప్రజలను పట్టించుకోలేదు. నందికొట్కూరును నట్టేట ముంచారనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు వైసీపీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించాలన్న పట్టుదలతో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చి దిద్దుతారని నమ్మి ఓట్లు వేసినందుకు వైసీపీ ప్రభుత్వం తమకు బాగా బుద్ధి చెప్పిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'మేం చేయం.. ఇతరులు చేస్తే ఒప్పుకోం' అనేది వైసీపీ తీరు. అధికారంలోనికి వచ్చిన తర్వాత వైసీపీ నందికొట్కూరు నియోజకవర్గంలో చేపట్టిన ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా లేదు. పైగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.110 కోట్లతో ప్రారంభించిన తాగునీటి పథకాన్ని గాలికి వదిలేసింది. దీంతో పట్టణంలో నీటి కొరత ఏర్పడి, ప్రజలు ట్యాంకర్లతో నీరు కొనుక్కునే పరిస్థితి దాపురించింది. ఇక యువ క్రీడాకారుల కోసం గత టీడీపీ ప్రభుత్వం నందికొట్కూరులో ఇన్‌డోర్ స్టేడియం పనులను చేపట్టింది. ఇది పూర్తి చేస్తే టీడీపీకి ఎక్కడ గుర్తింపు వస్తుందన్న ఉద్దేశంతో స్టేడియం పనులను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టి, కొత్త దానిని నిర్మించింది. అయితే దీని నిర్వహణను సరిగా పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక మైనారిటీల కోసం షాదీఖానా నిర్మాణం ఆరంభించి నాలుగేళ్లు దాటినా పూర్తిగా పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తున్నాయన్న ఉద్దేశంతో ఆరు నెలల క్రితం పనులను ప్రారంభించింది. అయితే ప్రభుత్వం నిధులు సరిగా కేటాయించకపోవడంతో పనులు ఆగిపోయాయి. 'వైసీపీ ప్రభుత్వ పనితీరు ఇలా ఉంటుందా? ' అని నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

అన్న చెప్పాడంతే..

వైసీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత నందికొట్కూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఆ పార్టీ నాయకులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. ఎక్కడ పడితే అక్కడ అక్రమ లే అవుట్లు వేస్తూ దండిగా జేబులు నింపుకుంటున్నారు. గతేడాది ఆఖర్లో 'కుడా' అధికారులు నందికొట్కూరు పట్టణంలోని అక్రమంగా వెలసిన లే అవుట్లపై దాడులు నిర్వహించారు. ఒక వర్గానికి చెందిన నాయకులను టార్గెట్ చేస్తూ.. మరో వర్గం నాయకులు కావాలనే ఈ దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. దాడుల వ్యవహారాన్ని ముందే పసిగట్టిన వైసీపీ కౌన్సిలర్లయిన రియల్టర్లు తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి, అధికారులు తమ వెంచర్లపై దాడులు చేయకుండా ఆపగలిగారు. ఇది ఇలా ఉంటే అక్రమ వెంచర్లు వేస్తున్న వైసీపీ నాయకులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. సాధారణంగా ఎకరం పొలంలో వెంచరు వేసేందుకు వివిధ రకాల ఫీజల రూపంలో ప్రభుత్వానికి రూ.3.10 లక్షలు చెల్లించాలి. దీనికి తోడు వెంచర్లలో వివిధ అవసరాల కోసం 10 శాతం స్థలం వదలాలి. ఈ నిబంధనలు పాటించకుండా, ప్రభుత్వానికి ఫీజుల చెల్లించకుండా అధికారులను బురిడీ కొట్టిస్తుండటంతో ప్రభుత్వానికి రూ. కోట్లలో నష్టం వాటిల్లుతోంది. ఏ అధికారి అయినా వీరి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తే.. 'అన్న చెప్పాడు. మేము వేసే లే అవుట్ల వైపు కన్నెత్తి చూడకండి.? ఏదైనా తేడా వస్తే, అన్నకు చెబుతా'మంటూ అధికారులను బెదిరిస్తున్నారు. వైసీపీ పై స్థాయి నాయకులను అడ్డం పెట్టుకుని ఆ పార్టీ కింది స్థాయి నాయకులు తమ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మూడు పూవులు.. ఆరు కాయలుగా సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వర్గ పోరు.. ప్రొటోకాల్ గొడవలతోనే..



కిందటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున పోటీకి దిగిన తోగూరు ఆర్థర్ నియోజకవర్గానికి కొత్త. అయితే ఆయనను గెలిపించే బాధ్యతను ఆ పార్టీ అప్పట్లో ముఖ్యంగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి అప్పగించారు. అందరూ కలిసి ఆర్థర్ గెలుపునకు కృషి చేశారు. అయితే ఆ తర్వాత ఆర్థర్, సిద్ధార్థ మధ్య విభేదాలు పొడసూపాయి. నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ఉన్నా.. ఆ పార్టీకి చెందిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వర్గం ప్రతిపక్షంలో ఉన్నట్లు భావించింది. అట్లాగే తమను సిద్ధార్థరెడ్డి వర్గం నామినేటెడ్ పోస్టులకు దూరం చేసిందన్న ఉద్దేశం ఎమ్మెల్యే వర్గంలో ఉండేది. ఇలా రెండు వర్గాలు బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలు తమ పనుల కోసం ఒకరి వద్దకు వెళితే మరొకరికి కోపం వచ్చేది. ఎమ్మెల్యేనే అడగలేకపోయారా? అని ఒకరు అంటే.. సిద్ధార్థ దగ్గరికే వెళ్లలేకపోయారా? అంటూ మరో వర్గం నిష్టూరాలాడేవారనే విమర్శలు వచ్చాయి. దీంతో నియోజకవర్గ ప్రజలు తమ సమస్యను ఎవరితో చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడిపోయారు. దీని వల్ల నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిపోయింది.



నందికొట్కూరులో అసంపూర్తిగా ఉన్న మంచినీటి పథకం

అభ్యర్థి మార్పు ఆనవాయితీతో..



'ఒక అభ్యర్థి ఒకసారే' అనే పద్ధతిని నందికొట్కూరులో వైసీపీ సాగిస్తోందని నియోజకవర్గ ప్రజలకు బాగా అవగతమైంది. మూడు పర్యాయాలుగా ఇక్కడ ఒకసారి పోటీలో దిగిన వారు మరోసారి బరిలోనికి దిగడం లేదు. 2014లో వైసీపీ మొదటిసారి ఐజయ్యను తమ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకోగా, 2019లో రెండోసారి ఐజయ్యకు మొండి చేయి చూపించి తోగూరు ఆర్థర్‌కు అవకాశం ఇచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆర్థర్‌ను తప్పించి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తన సొంత జిల్లా కడపకు చెందిన ధారా సుధీర్‌ను ఎన్నికల బరిలో నిలిపారు. ఈసారి కూడా తమదే గెలుపని వైసీపీ గట్టిగా భావిస్తోంది. అయితే గత రెండు పర్యాయాలు వైసీపీ అభ్యర్థులకు ఎదురుకాని వ్యతిరేకత ప్రస్తుత అభ్యర్థి సుధీర్ పట్ల వ్యక్తమవుతోంది. సుధీర్ స్థానికుడి కాదని, ఒకవేళ గెలిపిస్తే ఎక్కడికో వెళ్లి పనులు చేయించుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయంతో స్థానిక ప్రజల్లో లోకల్, నాన్ లోకల్ అనే భావన తెరపైకి వచ్చింది. వైసీపీ వల్లనే నందికొట్కూరు నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట తప్పి.. మడమ తిప్పి

'మాట తప్పను.. మడమ తిప్పను' అని 2019 ఎన్నికలకు ముందు చెప్పిన జగన్ నియోజకవర్గంలో ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారు. దీనికి ఉదాహరణ.. శ్రీశైలం ముంపు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వంచించిచడం. ఉద్యోగాలు వస్తాయేమనని ఎదురు చూసిన నిర్వాసితులకు నిరాశే మిగిలింది. ఇక స్థానికంగా కేజీ రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన దుకాణాదారులకు నష్టపరిహారం ఇవ్వనేలేదు. ప్రస్తుతం కేజీ రోడ్డు పరిస్థితి అరగుండు కొట్టిన చందంగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలోని మిడ్తూరు మండలం మాత్రం కర్నూలు పశ్చిమ కరువు ప్రాంతాన్ని తలపిస్తున్నది. ఈ మండలంలో ఒక్క



ఎకరాకు కూడా సాగునీరు పారే పథకాలు లేవు. తాము అధికారంలోనికి వస్తే మిడ్తూరు మండలానికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తామని జగన్ ప్రతిపక్ష నేత హోదాలో గొప్పలు చెప్పారు. కానీ మిడ్తూరు మండలాన్ని కరువు ప్రాంతంగానే వదిలేశారు. ఇది చాలక, టీడీపీ హయాంలో శ్రీకారం చుట్టిన 'మిడ్తూరు ఎత్తిపోతల పథకం' పనులను తుంగలో తొక్కేశారు. ఓట్ల కోసం పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తానని చెప్పిన జగన్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు. పక్కనే కృష్ణా నది గలాగలా పారుతున్నా.. నందికొట్కూరు పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారంటే.. వైసీపీ పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

బుగ్గన గెలవలేడు: కోట్ల



ప్రచార రథంపై కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 24: ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా సంపాదించిన అవినీతి డబ్బుతో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గెలవలేడని టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కోట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తాము వేసిన రోడ్ల మీద మళ్లీ రోడ్లు వేసి మంత్రి బుగ్గన డబ్బులు సంపాదించుకున్నాడని విమర్శించారు. మంత్రి పదవితో అక్రమంగా బుగ్గన తన ఆస్తులు పెంచుకున్నాడే తప్ప.. ప్రజలు ఎలాంటి అభివృద్ధి చెందారో చూపించగలవా? అంటూ సవాల్ విసిరారు. బుగ్గన అక్రమంగా సంపాదించిన డబ్బుతో పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని కొనుగోలు చేసి స్థానిక కార్మికులకు ఉద్యోగాలు లేకుండా చేశాడన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కోట్ల ప్రకటించారు. తనకు కర్నూలు పార్లమెంటు సీటు ఇవ్వకపోతే.. డోన్‌లో వచ్చి పోటీ చేస్తున్నానని బుగ్గన మాట్లాడుతున్నాడని.. బీసీలు రాజకీయంగా ఎదగాలన్న ఉద్దేశంతోనే తాను త్యాగం చేశానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి పోటీ చేయకుండా బీసీకి అవకాశం ఇస్తానని, బుగ్గన కూడా పోటీ చేయకుండా వదులుకుంటారా అని సవాల్ విసిరారు.

ఎన్నికల పరిశీలకుల నియామం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు



పంకజ్‌కుమార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 24: జిల్లాలో ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు భారత ఎన్నికల సంఘం సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో డా.కె. శ్రీనివాసులు, ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి ఎన్నికల పరిశీలకుడు పంకజ్‌కుమార్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు.

నేడు ఆఖరు

- నామినేషన్లకు దగ్గరపడిన గడువు
- ఆరో రోజు 74 నామినేషన్లు



డోన్‌లో నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారం ముగియనుంది. ఆరో రోజు బుధవారం 74 నామినేషన్లు దాఖలయ్యాయి. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గానికి 12, జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు 62 మంది తమ నామినేషన్లను దాఖలు చేశారు. నంద్యాల పార్లమెంటుకు సంబంధించి టీడీపీ తరఫున బైరెడ్డి శబరి, వైసీపీ నుంచి పోచా బ్రహ్మానందరెడ్డి దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జే.లక్ష్మీనరసింహ యాదవ్, బీఎస్పీ నుంచి చిన్న మౌలాలి, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి సి పాండురంగ యాదవ్, స్వతంత్ర అభ్యర్థి అతావుల్లా ఖాన్ తమ నామినేషన్లను సమర్పించారు. అదేవిధంగా డోన్ నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ నుంచి గార్లపాటి మద్దిలేటి స్వామి నామినేషన్లు వేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి, శ్రీశైలంలో బుడ్డా రాజశేఖరరెడ్డి దాఖలు చేశారు. నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్ (రెండు సెట్లు), టీడీపీ నుంచి జి.జయసూర్య (మూడు సెట్లు), బండి జయరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి టి.నాగరాజు, కాంగ్రెస్ అభ్యర్థి తోగూరు ఆర్థర్ (రెండు సెట్లు) నామినేషన్లు సమర్పించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోకుల్ కృష్ణారెడ్డి, వైసీపీ నుంచి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎస్ చంద్రమోహన్‌రెడ్డి, సమాజ్ వాది పార్టీ నుంచి షేక్ ఫరిదాబి (రెండు సెట్లు), టీడీపీ నుంచి ఎన్ఎండీ ఫరూక్, నవభారత నిర్మాణ సేవా పార్టీ నుంచి కే ఆదినారాయణరెడ్డి, భారత చైతన్య యువజన పార్టీ నుంచి సుధాకర్‌లు నామినేషన్లు వేశారు. బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ నుంచి కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ, టీడీపీ నుంచి బీసీ జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి జి.పుల్లయ్య నామినేషన్లు వేశారు. మొదటి 90 నామినేషన్లు ఐదురోజుల్లో దాఖలు కాగా ఆరో రోజు ఏకంగా 74 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 164 నామినేషన్లు అందినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

నేడే లాస్ట్ చాన్స్ : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం నేటితో ముగియనుంది. ఈ నెల 18 నోటిఫికేన్ విడుదల కాగా, నామినేషన్లు వేసేందుకు ఈ నెల 25వ తేది ఆఖరుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. నామినేషన్లు ఘట్టం పూర్తి కాగానే పరిశీలన మొదలవుతుంది. ఈ ప్రక్రియ రెండు జరిగిన తర్వాత వివరాలు సరిగా పొందుపరచని అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురవుతాయి. ఇప్పటికే జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయడంతో ఇక ఎన్నికల ప్రచార హోరు మోతెక్కనుంది. ఆయా నియోజకవర్గాల్లో రెండు ప్రధాన పార్టీలు ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు సిద్ధమయ్యారు.



కర్నూలులో నామినేషన్ దాఖలు చేస్తున్న పాణ్యం అభ్యర్థి గౌరు చరిత


చంద్రబాబుతోనే సుపరిపాలన

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె తహసీల్దారు కార్యాలయంలో బీసీ రెండో సెట్ టీడీపీ తరఫున రిటర్నింగ్ అధికారి కామేశ్వర్‌రావుకు నామినేషన్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. అరాచక, అవినీతి వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సుపరిపాలన టీడీపీతోనే సాధ్యమని పునరుద్ఘాటించారు. రాష్ట్రం బాగు పడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి టీడీపీతో సాధ్యమన్నారు. సీఎం జగన్ పోలవరం సర్వనాశనం చేసి, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలు నిబంధనల పేరుతో జగన్ అన్యాయం చేశారని అన్నారు. విద్యుత్ చార్జీలు, డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు వైసీపీ పాలనలో ఆకాశాన్నంటాయన్నారు. వైసీపీ పాలనలో మైనింగ్ పరిశ్రమ సర్వనాశనం అయిందన్నారు. 40 వేల మంది కార్మికులకు గనుల్లో పనులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కుటుంబ సభ్యులు బీసీ రాజారెడ్డి, మనోరమ, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి



ఓటమి ఎరుగని వీరుడు..

డోన్‌లో పోటీ చేసిన ప్రతిసారి గెలిచిన కేఈ కృష్ణమూర్తి



డోన్, ఏప్రిల్ 24: డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని వీరుడుగా కేఈ కృష్ణమూర్తికి పేరుంది. పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ గెలిచిన రికార్డు ఆయన సొంతం. డోన్ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో 1978 సంవత్సరంలో కేఈ మాదన్న వారసులుగా కేఈ కృష్ణమూర్తి అడుగు పెట్టారు. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) అభ్యర్థిగా పోటీ చేసి మొదటిసారి ఎమ్మెల్యేగా కేఈ కృష్ణమూర్తి విజయం సాధించారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన కేఈ పలు మంత్రి శాఖలకు లఘు పరిశ్రమలు, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి రెండోసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి విజయం సాధించారు. ఆ తర్వాత 1985లో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఆయన పని చేశారు. మళ్లీ 1989లో కాంగ్రెస్ పార్టీ తరుపున డోన్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి కేఈ కృష్ణమూర్తి గెలుపొందారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఐదో సారి కేఈ కృష్ణమూర్తి విజయం సాదించారు. ఇలా డోన్‌లో పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లోనూ కేఈ కృష్ణమూర్తి ఓటమి అనేది లేకుండా విజయపతాకం ఎగురవేసి చరిత్రను సృష్టించారు.

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే..

అభ్యర్థులు ఎక్కువైనప్పుడు



చాగలమర్రి/కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 24: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎంలో 16 మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలు ఉంటుంది. అంతకన్నా ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18 మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదటి ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయిన ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటి వరకు నమోదైన వివరాలు సీజ్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

1957 ఎన్నికల్లో అభ్యర్థికో బ్యాలెట్ బాక్సు


అప్పుడు అలా..!



చాగలమర్రి, ఏప్రిల్ 24: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, ఎన్నికల నిర్వహణ సులభతరం కోసం చట్టసభల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కొన్ని దఫాలుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను అందుబాటులోకి తెచ్చింది. అంతక ముందు బ్యాలెట్ పత్రం విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులు ఉండేవి. అయితే అభ్యర్థులందరికీ కలిపి ఒకే బ్యాలెట్ ఉన్నట్లుగానే ఓటు వేసిన బ్యాలెట్ పత్రాలను పోలింగ్ బూతుల్లోని ఒకే బ్యాలెట్ బాక్సులో వేసేవారు. అయితే 1952, 1957లో నిర్వహించిన మొదటి, రెండు సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు సమానంగా పోలింగ్ బూత్‌లలో బ్యాలెట్ బాక్సులు ఉండేవి. దీంతో బ్యాలెట్ బాక్సుల తయారీ, రవాణా, భద్రపరచడం, ఓట్ల లెక్కింపుకు తదితర ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు సంక్లిష్టంగా ఉండేవి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సంస్కరణలు తేవడంతో 1962 ఎన్నికల నుంచి ఒకే బ్యాలెట్ బాక్సు విధానం అమలులోకి వచ్చింది.

భారత తొలి రాష్ట్రపతి నంద్యాలకు వచ్చిన వేళ..

జ్ఞాపకం



బాబు రాజేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల టౌన్, ఏప్రిల్ 24 : భారత దేశ మొట్టమొదటి రాష్ట్రపతి, క్రమశిక్షణకు, దృఢ నిర్ణయాలకు తనకు తానే సాటి అనిపించుకున్న డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధికారిక హోదాలో 1952లో నంద్యాలలో పర్యటించారు. బళ్లారి నుంచి రైలు మార్గం ద్వారా బొగ్గు రైలులో రాష్ట్రపతిగా నంద్యాలకు విచ్చేసిన బాబు రాజేంద్రప్రసాద్‌కు అప్పటి సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఎంతో ఆప్తుడైన కాదరబాద్ నరసింగరావు స్వాగతం పలికారు. రాష్ట్రపతికంటే ముందు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నంద్యాలకు వచ్చి నరసింగరావు చేపట్టిన హరిజనోద్ధరణ, పేద విద్యార్థులు, రైతుల కోసం చేసిన కృషిని తానే స్వయంగా బాబు రాజేంద్రప్రసాద్‌కు వివరించడంతో ఆయన అప్పట్లో నంద్యాలకు వచ్చారు. అంతకు మునుపు 1937లో నరసింగరావు ఆధ్వర్యంలోనే నిర్వహించిన ప్రొవిన్షియల్ కాంగ్రెస్ మహాసభలు నిర్వహించినప్పుడు సీ రాజగోపాలాచారి వంటి ఎందరో రాజకీయ మదరాసు నాయకులు రాగా, ఆ సమావేశానికి తాను కూడా హాజరైన విషయాన్ని రాష్ట్రపతి హోదాలో బాబు రాజేంద్రప్రసాద్ ప్రజల ముందు గుర్తు చేయడం నంద్యాల ఖ్యాతి అప్పట్లో దేశస్థాయిలో ఎలా ఉండేదో ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతోంది.

ప్రలోభపెడితే.. చర్యలు తప్పవు!



శిరివెళ్ల, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జోరందుకుంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ప్రచారం ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న తరుణంలో ఓటర్లకు తాయిలాలు ఇవ్వాలని చూసినా మద్యం, నగదు పంపిణీతో పాటు నిషేధిత ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటు చేసినా ఎన్నికల సంఘం తీవ్ర నేరంగా పరిగణిస్తుంది. వీటన్నింటిని పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలతో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, భారత శిక్షాస్మృతి లోని సెక్షన్ 171లో ఉన్న పలు సబ్‌క్లాజ్‌ల కింద కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే జరిమానా, శిక్ష లేదా రెండింటికి గురయ్యే ప్రమాదం ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేస్తే.. కేసులు, శిక్షలు ఎలా నమోదవుతాయో తెలుసుకుందాం.

ఐపీసీ సెక్షన్ 171లోని సబ్‌క్లాజ్‌ల కింద కేసుల నమోదు



● మద్యం సరఫరా చేస్తే :



రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం ప్రారంభించినప్పటి నుంచి ఎన్నికలు ముగిసేంత వరకు కార్యకర్తలు, ప్రజలకు మద్యం పంపిణీ చేస్తుంటారు. ప్రస్తుతం ఓ వ్యక్తి మూడు మద్యం సీసాలు తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతులున్నాయి. కానీ ఎన్నికల తరుణం కావడంతో మద్యం దుకాణాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి మద్యం భారీగా తరలిస్తుంటారు. అలా అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుపడితే 'ఎక్సైజ్ యాక్ట్ 1968 సెక్షన్ 34-ఏ' ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేలు నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

ఎన్నికలంటే డబ్బే.. డబ్బు



అధికారులకు లంచం రూపంలో డబ్బులు ఇచ్చినా.. ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ-171-బీ కింద కేసు నమోదు చేస్తారు. భారీగా నగదు అక్రమ చెల్లింపులు చేస్తే ఐపీసీ 171-హెచ్ కింద చర్యలు తీసుకుంటారు.

● ఖర్చుల వివరాలు తప్పనిసరి



ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను ఎన్నికలు ముగిసిన నెలలోపు ఎన్నికల సంఘానికి తప్పనిసరిగా అందించాలి. ఎన్నికల ఖర్చుకు సంబంధించి అభ్యర్థులు ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్ 171-ఐ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

● ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తే..



ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు కీలకమైన ఓటర్లను బెదిరించడం, ఒత్తిడికి గురి చేయడం నేరం. ఇలా చేసినట్లు రుజువైతే వారిపై 'ఐపీసీ సెక్షన్ 171-సీ' చట్టం కింద కేసు నమోదు చేస్తారు.



● రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే..

ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా, కించపరిచేలా కొందరు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం, ప్రాంతీయ కులం, మతం వారీగా వేరు చేసి ప్రలోభపెట్టేలా హామీలు ఇవ్వడం చేస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951సెక్షన్ 125, ఐపీసీ సెక్షన్ 171-డీ కింద కేసులు నమోదు చేస్తారు.

● ప్రచార సమయం మీరినా ప్రమాదమే

కేంద్ర ఎన్నికల సంఘం అభ్యర్థులకు కేటాయించిన సమయం వరకు మాత్రమే ప్రచారాలు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమించి భారీ మైక్‌సెట్లు, డీజేలు వినియోగించకూడదు. వీటిని ఉల్లంఘిస్తే ఐపీసీ 171-ఎఫ్ కింద చర్యలు చేపడతారు.



● అసత్య ఆరోపణలు చేస్తే..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లను ఆకర్షించేందుకు లేనిది ఉన్నట్లు అసత్య ప్రచారం, ఆరోపణలు, తప్పుడు ప్రకటనలు చేస్తుంటారు. అలాంటి సమయంలో ప్రత్యర్థులు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. దీంతో బాధ్యులపై ఐపీసీ 171-జీ కింద కేసు నమోదు చేస్తారు.

కానుకలు పంపిణీ చేయడం నేరం

ఓటర్లను ప్రలోభపెట్టడంలో భాగంగా వారికి కానుకలు పంపిణీ చేయడం చట్టరీత్యా నేరం. ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు తమ పరిధిలోని మహిళా ఓటర్లకు చీరలు, బంగారు ముక్కుపుడకలు, వెండి వస్తువులు, గృహోపకరణ సామగ్రి తదితర వాటిని పంచుతుంటారు. పురుష ఓటర్లకు విందులు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. ఓటర్లను నేరుగా ప్రలోభాలకు గురి చేయాలని చూస్తే ఐపీసీ 171-ఈ ప్రకారం కేసులు నమోదు చేస్తారు.



కండువా కప్పుకుంటే రూ.200



నందికొట్కూరు, ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో నాయకులు పార్టీలు మారుతుండటం సహజం. అటువంటి వారు తమ బలాన్ని, బలగాన్ని చూపించుకోవడానికి కూలీలను ఉపయోగించుకుంటున్నారు. పార్టీలు మారే క్రమంలో తమ వెంట కూలీలను తీసుకెళ్తున్నారు. అయితే ఇతరుల పార్టీల వారికి కూడా వీరే వెళ్తున్నారు. ఇలా చేయడం వల్ల వారు ఇచ్చే రూ.200 చేతి ఖర్చులకు వస్తాయన్న భావన కూలీల్లో నెలకొంది. ఎన్నికల ప్రచారానికి వస్తున్న నేపథ్యంలో తమ కుటుంబ సభ్యుల పేర్లను రాయించుకుని అభ్యర్థి రాగానే ప్రచారంలో కండువా కప్పుకుని జెండా చేతపట్టుకుని తిరుగుతున్నారు. ఇక కొంత మంది నాయకులు తమ కుటుంబ సభ్యుల పేర్లను, బంధువుల పేర్లను పెట్టి డబ్బులు జేబుల్లో వేసుకుంటున్నారు. అయితే ఓటరు దేవుడి మనస్సులో ఏముందో అర్థం కాని పరిస్థితి.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆస్తులివే..



బనగానపల్లె, ఏప్రిల్ 24: బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావుకు సమర్పించారు. కాటసాని రామిరెడ్డి స్థిర ఆస్తులు రూ.16, 41,70,000, ఆయన భార్య జయమ్మ పేరు మీద రూ.18.90 కోట్లు, కాటసాని రామిరెడ్డి చరాస్థులు 1.90కోట్లు, కాటసాని జయమ్మ చరాస్థులు రూ. 3.77 కోట్లు ఉన్నట్లు చూపారు. కాటసాని రామిరెడ్డి అప్పులు రూ.2,52,65,434లు, కాటసాని జయమ్మ అప్పులు రూ.2,58,15,705 ఉన్నట్లు చూపారు.

కామ్మో ఇన్ని కోట్లా...

ఎంపీ పోచా ఆస్తులు రూ.147.74 కోట్లు

● అప్పులు రూ.54.37 కోట్లు

నంద్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఆస్తుల విలువ దాదాపు రూ.147 కోట్లకు పైగానే ఉందని ఆయన ఎన్నికల అధికారులకు బుధవారం సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం ఆయన పేరిట చరాస్తులు రూ.50,19,35,355, ఆయన భార్య పోచా రామపుల్లమ్మ పేరిట రూ.21,20,43,092, ఇక ఉమ్మడిగా రూ.57,45,31,623 ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఇక స్థిరాస్తుల రూపంలో పోచా బ్రహ్మానందరెడ్డి పేరిట రూ.28,59,39,000, ఆయన భార్య పేరిట రూ.16,11,17,000, ఉమ్మడిగా రూ.25,89,87,000 విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. పోచా, ఆయన భార్య, ఉమ్మడి స్థిర, చరాస్తులు విలువ రూ.147.74 కోట్లుగా చూపించారు. ఇక ఆయన అప్పులు గురించి చూస్తే పోచా బ్రహ్మానందరెడ్డి పేరిట రూ.32,25,13,224 ఉండగా, ఆయన భార్య పేరిట రూ.11.89 కోట్లు చూపించారు. ఇద్దరికీ కలిపి మొత్తం అప్పులు రూ.54.37 కోట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

హ్యాట్రిక్ వీరులు

● భూమా నాగిరెడ్డి, ఎస్‌పీవైరెడ్డిలదే ఆ ఘనత







నంద్యాల టౌన్, ఏప్రిల్ 24 : ఉమ్మడి జిల్లాలో ఎంపీలు హ్యాట్రిక్ సాధించిన ఘనత ఆ ఇద్దరికే దక్కుతుంది. భూమా నాగిరెడ్డి, ఎస్పీవై రెడ్డిలు వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. దేశ ప్రధాని హోదాలో పీవీ నరసింహారావు 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో నంద్యాల ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. అలాగే 1996లో పీవీ రెండోసారి పోటీ చేసి విజయం సాధించడం, అదే సమయంలో ఒడిస్సాలోని బరంపురం నుంచి కూడా పోటీ గెలిచారు. దీంతో నంద్యాల స్థానానికి రాజీనామా చేయడంతో 1996లోనే ఉప ఎన్నిక జరిగింది. అంతకు మునుపు జరిగిన ఎన్నికల్లో ప్రధాని పీవీపైన పోటీ చేసి గట్టిపోటీ ఇచ్చి 5.80 లక్షల మెజార్టీని లక్ష ఓట్ల మెజార్టీకి తగ్గించడంలో యువనేతగా టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి సంచలనం లేపారు. దీంతో ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన భూమా నాగిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పీవీ రంగయ్య నాయుడుపై విజయం సాధించి మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపై భూమా నాగిరెడ్డి పోటీ చేసి రెండోసారి ఎంపీగా గెలుపొందారు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గంగుల ప్రతాపరెడ్డిపైనే టీడీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి పోటీ చేసి గెలుపొందడంతో వరుస విజయాలతో హ్యాట్రిక్ ఎంపీగా రికార్డుల్లోకి ఎక్కారు. ఈ నేపథ్యంలోనే 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమా శోభా నాగిరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్‌పీవై రెడ్డి గెలిచి మొదటిసారి ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్‌పీవై రెడ్డి విజయం సాధించి రెండోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్‌పై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్‌పీవైరెడ్డి గెలుపొందడంతో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించిన రెండో ఎంపీగా రాజకీయాల్లో ఘనత సాధించారు. ఎందరో రాజకీయ ఉద్దండులు జిల్లా నుంచి ఎంపీలుగా గెలుపొందినప్పటికీ హ్యాట్రిక్ ఎంపీలుగా కర్నూలు పార్లమెంట్ నుంచి ఎవరూ లేకపోవడం, నంద్యాల పార్లమెంట్ నుంచి భూమా నాగిరెడ్డి, ఎస్‌పీవైరెడ్డిలు ఎంపీలుగా గెలువడంతో వీరిద్దరి ప్రాముఖ్యత రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.



మది నిండా టీడీపీ జెండా

టీడీపీకి అతను వీరాభిమాని. తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ఎక్కడ జరిగినా అక్కడికి చేరుకుంటాడు. తనకున్న సైకిల్ నిండా టీడీపీ జెండాలను కట్టుకొని ప్రదర్శన కార్యక్రమం చేపడతాడు. గంగావతి నగర్ కల్లూరు ఎస్టేట్ వాసి శీర్వటి వీరాంజనేయులు 20 ఏళ్లు తెలుగుదేశం పార్టీ వెంటే నడుస్తున్నాడు. పార్టీ అంటే అంతులేని అభిమానం చూపుతుంటాడు. ఇందులోభాగంగానే బుధవారం తెలుగుదేశం పార్టీ పాణ్యం అభ్యర్థి గౌరు చరితారెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యాడు. ఆమెకు మద్దతుగా టీడీపీ జెండాలతో సైకిల్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తనకు అభిమాన నటుడు అని, అందుకే తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తుంటానని చెబుతున్నాడు.

నామినేషన్ ఉందని ఉపాధి పనులు బంద్..?



రుద్రవరం, ఏప్రిల్ 24 : రుద్రవరం మండలంలోని లింగందిన్నె గ్రామంలో అధికార పార్టీ అభ్యర్థి నామినేషన్ ఉన్నందున బుధవారం ఉపాధి హామీ పనులు బంద్ చేశారు. గ్రామంలో సుమారు 400 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. పనులు కల్పించకుండా నిలిపివేయడం నిరుపేద కూలీల కడుపు కొట్టినట్లే కదా అన్న విమర్శలు ఉన్నాయి.

టిఫిన్ పెట్టే వాళ్లు



ఎమ్మిగనూరు: ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటు వేశాను. ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో ఓటర్లకు ఉగ్గాని పెట్టేవారు. ఓటు వేయాలి ఉగ్గాని తిని ఇంటికి వెళ్లాలనే విధంగా ఉండేది. డబ్బు గురించి ఎవరూ పట్టించుకునే వారు కాదు. డబ్బు ప్రభావం కనిపించేది కాదు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల ఏజంటుగా కూర్చుంటే రూ.200 ఇచ్చేవారు తప్పితే.. ఓటు వేసేందుకు ఒక్క రుపాయి ఇచ్చేవారు కాదు. సోమప్ప, శివన్న వాళ్ల మీటింగ్ పెట్టి చెపితే ఆ ప్రకారంగా నడుచుకునే వాళ్లం.

- ఈరన్న, ఎమ్మిగనూరు

నోటుకు ఓటు చేటు



బండిఆత్మకూరు, ఏప్రిల్ 24: నా వయస్సు 19 సంవత్సరాలు. నేను బీకాం చదువుతున్నా. గత ఏడాది ఓటు నమోదు చేసుకున్నా. మే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నాను. నేను వేసే ఓటు చెడుపై ఆయుధం అవుతుంది. నోటుకు అమ్ముడుపోతే ప్రజాస్వామ్యం అపహాస్యమై అది సమాజ మనుగడకు చేటుగా పరిణమిస్తుంది. రాజ్యాంగం కల్పించిన ఓటును ఎవరికీ అమ్ముకోకూడదు. యువత మంచి వారికి ఓటు వేసి ఎన్నుకోవాలి.

- ఆర్లగడ్డ మారుతి యుగంధర్, పెద్దదేవళాపురం

మంచి పరిపాలన అందించే నాయకునికే నా ఓటు



మహానంది, ఏప్రిల్ 24 : ప్రజల కష్టాలు తెలుసుకొని తీర్చే నాయకునికే ఓటు వేస్తాను. ఐదేళ్లపాటు సమర్థవంతంగా పరిపాలించే నాయకున్ని ఎన్నుకునే వారికే నా ఓటు. నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చే హామీల్లో గెలిచిన తర్వాత 50 శాతం అమలు చేసినా రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుంది. ఉచిత పథకాల మంత్రం వల్ల జనాలు సోంబేరులు అవుతున్నారు. అలాంటి నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం ఓటుతో చెప్పాలి. పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ సమస్య తీర్చే నాయకునికే ఓటు వేయాలి.

- కాటంరెడ్డి ప్రసాదరెడ్డి, గోపవరం, మహానంది మండలం

తొలిసారిగా ఓటు వేయబోతున్నా

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 24: తొలిసారిగా ఓటు వేయబోతున్నా. మంచి పాలనను ఎంచుకోవడానికి ఓటే మార్గమని చదువుకున్నాం.



యువత చైతన్యమైతే.. వెనుకటి, ముందు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవచ్చు.

- చెన్నకేశవులు, నూతన ఓటరు, వర్కూరు

అమరావతి అభివృద్ధికే..

రుద్రవరం, ఏప్రిల్ 24 : అమరావతి అభివృద్ధికే ఓటు వేస్తాం. ఒక రాజదాని ముద్దు, మూడు రాజధానులు వద్దు. ఆళ్లగడ్డ అభివృద్ధికే ఓటు వేస్తాం, డీఎస్సీ అన్నారు. డీఎస్సీ ఎక్కడ? మద్యపాన నిషేధం అన్నారు. ఐదేళ్లుగా ఆ ఊసే లేదు. మద్యం కిక్కులో పల్లెలు ఉన్నాయి.



- ప్రమీలమ్మ, రుద్రవరం

నీడలా నీవెంటే!

- రంగంలోకి తనిఖీ బృందాలు
- అభ్యర్థుల ఖర్చులు, నియమావళిపై ఆరా





కర్నూలు, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. ఫలానా రాజకీయ పార్టీ నేతలు ఇప్పటికే నామినేషన్లు మొదలు పెట్టారు. ఎన్నికల ప్రక్రియ ప్రధాన ఘట్టానికి చేరుకుంది. మరో నాలుగు రోజుల్లో నామినేషన్ ఘట్టం ముగుస్తుంది. ఆయా పార్టీల అభ్యర్థులు తమ గెలుపు కోసం సర్వం సిద్ధమయ్యారు. ఈ సారి గట్టి పోటీ ఉండడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టబోతున్నట్లు సమాచారం. మరో వైపు పార్టీ అధినేతలు పార్టీ ఫండ్ కింద పెద్ద మొత్తంలో ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క నియోజకవర్గానికి అభ్యర్థి ఖర్చు రూ.30 కోట్ల పైమాటే ఉన్నట్లు చర్చ జరుగుతోంది. నీడలా వెంటాడేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా స్క్వాడ్‌లను నియమించింది. అయితే అభ్యర్థుల ఖర్చుపై నిఘా బృందం ఎప్పటికప్పుడు ఆరా తీస్తోంది.

రంగంలో ఏడు బృందాలు

ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్): ఈ బృందంలో ఒక గెజిటెడ్ అధికారి, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ఒక్కో బృందంలోని సభ్యులంతా తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఎక్కడైతే డబ్బు, మద్యం పంచుతున్నట్లు సమాచారం వచ్చిందో.. ఈ బృందం అక్కడకు వెళ్లి వాటిని నియంత్రిస్తుంది. రోజువారి వివరాలను సంబంధిత ఆర్వోకు పంపిస్తారు.

స్టాటిక్ సర్వేలియన్స్ బృందం (ఎస్ఎస్‌టీ)

ఈ బృందం చెక్‌పోస్టుల్లో ఉంటూ వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేస్తుంది. డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమంగా తరలిస్తుంటే.. వాటిని స్వాధీనం చేసుకుంటుంది. ప్రతి రోజూ ఆర్వోకు లెక్కలు చెప్పాలి. ప్రతి తనిఖీని వీడియో చిత్రీకరించాలి. ఏమైనా తరలించినా రశీదులు, ఆధారాలు ఈ బృందానికి చూపాల్సిందే..

కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)

ఈ బృందంలో పలువురు అధికారులు, కానిస్టేబుళ్లు, వీడియోగ్రాఫర్లు ఉంటారు. అభ్యర్థులు ప్రచార రథాలు, వారి ఎన్నికల వ్యవహారాలు, ఇతర జమా ఖర్చులను సేకరించి నిఘా పెడతారు. ఎవరైనా అభ్యర్థులు ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తున్నారో గమనిస్తుంటారు.

వీడియో సర్వేలియన్స్ బృందం (వీఎస్‌టీ)

ఈ బృందం అభ్యర్థుల సమావేశాలు, సభలు, ర్యాలీలపై దృష్టి సారిస్తారు. ఆ సభల్లో అభ్యర్థుల ప్రవర్తనా నియమావళిని గమనిస్తుంటారు.

అకౌంటింగ్ బృందం (ఏటీ)

ఈ బృందంలోని అధికారులు అభ్యర్థుల జమా ఖర్చులు లెక్క పెడుతుంటారు. అభ్యర్థి ప్రచారానికి ఎంత ఖర్చు చేస్తున్నాడు.. అభ్యర్థుల ప్రచారాలకు వచ్చే కార్యకర్తలకు పెట్టే భోజనాలు, ఇతర ఖర్చులు, వాహనాల డీజిల్, బాడుగ లాంటి ఖర్చులు లెక్కకట్టి వాటిని రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు. ఏ అభ్యర్థి అయినా.. ఎన్నికల నియమావళికి సంబంధించిన ఖర్చులు దాటారో వారిపై ఉల్లంఘనల కేసులు నమోదు చేస్తారు.

వీడియో వీక్షక బృందం (వీవీటీ)

ఈ బృందంలోని అధికారులు సర్వేలియన్స్ టీమ్ నుంచి వచ్చిన వీడియోలను నిశితంగా పరిశీలిస్తుంటారు. నియామవళి ఉల్లంఘనలకు సంబంధించిన విషయాలపై నిఘా పెడతారు. నియామవళి ఉల్లంఘిస్తే.. ఈ బృందం కఠిన చర్యలు తీసుకుంటుంది.



మంత్రాలయం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నియోజకవర్గాల వారిగా గమనిస్తే..

నియోజకవర్గం	ఎస్‌వోలు	ఎంసీసీ	ఎఫ్ఎస్‌టీ	ఎస్ఎస్‌టీ	వీఎస్‌టీ	వీవీటీ	ఏటీ	ఏఈవోలు
కర్నూలు	21	3	6	9	1	1	1	2
పాణ్యం	32	5	8	12	4	1	1	1
పత్తికొండ	27	5	10	9	1	1	1	2
కోడుమూరు	25	5	8	12	1	1	1	1
ఎమ్మిగనూరు	29	4	8	9	1	1	1	1
మంత్రాలయం	24	4	8	9	1	1	1	1
ఆదోని	26	3	6	9	1	1	1	2
ఆలూరు	29	6	10	9	1	1	1	1

- వీరిపైన ఎస్‌వోలు, ఏఈవోలు బృందాలుగా ఉంటారు.

కర్నూలు జిల్లాలో మొత్తం 213 ఎస్‌వోలు, 35 ఎంసీసీ బృందాలు, 64 ఎఫ్ఎస్‌టీ బృందాలు, 78 ఎస్ఎస్‌టీ బృందాలు, 11 వీఎస్టీ టీములు, 10 వీవీటీ టీములు, 9 అకౌంటింగ్ టీములతోపాటు 12 మంది ఏఈవోలు ఉన్నారు.

144 సెక్షన్ ఎందుకు విధిస్తారంటే..

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో అల్లర్లు జరిగే అనుమానం ఉన్న ప్రాంతాల్లో, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తారు. 144 సెక్షన్ అంటే ఎమిటి, ఎప్పుడు విధిస్తారో తెలసుకుందాం. సీఆర్‌పీసీసీ 144 సెక్షన్‌ల కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు పరిస్థితులను అదుపులోకి తేవడానికి ఈ సెక్షన్ అమలు చేస్తారు. ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద దీన్ని విధిస్తారు. ఈ సెక్షన్ అమలులోకి వస్తే నలుగురు. ఐదు వ్యక్తులకు మించి గుమికూడకూడదు. కలిసి తిరగడంపై కూడ నిషేధాజ్ఞలు విధిస్తారు. ఎన్నికల సమయంలో నామినేషన్ ప్రక్రియల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈసెక్షన్ అమలులో ఉంటుంది. ఆసమయంలో ప్రదర్శనలు ఊరేగింపులు, ర్యాలీలు, చేపట్టకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినపుడు ఇది విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్ పోలీసు మ్యాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌లు అమలు చేస్తారు.

40 ఏళ్లలో తొలిసారి..!

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సొంతూరు కడిమెట్లకు మాజీ ఎమ్మెల్యే బీవీ



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్లలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరురూరల్, ఏప్రిల్24: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామం కడిమెట్ల. ఈ పంచాయతీలో సిరాలదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల, రాళ్లదొడ్డి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలపై చెన్నకేశవరెడ్డికి ఆది నుంచి పట్టు ఉంది. ఈ గ్రామాల్లో ఇప్పటి వరకు ఆయన చెప్పిందే వేదం.. ఏ పార్టీకి ఓటు వేయమన్నా ఆ పార్టీకి ఓట్లు వేస్తూ రావటం ఆనవాయితీ. అంతేగాక ఈ గ్రామాల్లో ఇప్పటి వరకు ప్రత్యర్థి రాజకీయ పార్టీలు అడుగుపెట్టిన దాఖలాలు లేవు. దాదాపు 40 ఏళ్ల తర్వాత కడిమెట్లలోకి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బుధవారం అడుగుపెట్టారు. గ్రామంలోని చెన్నకేశవస్వామిని, మారెమ్మవ్వను దర్శించుకున్నారు. దారి పొడవున గ్రామస్థులను పలుకరిస్తూ బీవీ ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. కాగా దాదాపు 40ఏళ్ల తర్వాత టీడీపీ నుంచి పోటీలో ఉన్న బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామంలో పర్యటించడంతో గ్రామస్థులు ఆసక్తిగా చూశారు. ఇదిలా ఉండగా ఇటీవలే ఎమ్మిగనూరులో జరిగిన నందమూరి బాలకృష్ణ పర్యటనలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు విరుపాక్షిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చెన్నారెడ్డి టీడీపీలో చేరారు. వీరు ఆహ్వానించడంతో బీవీ గ్రామాన్ని సందర్శించారు. ఆయన వెంట రాళ్లదొడ్డి మురళి, పార్లపల్లి మల్లికార్జున, వెంకటేశ్వర్లు, సురేష్‌చౌదరి, చంద్ర ఉన్నారు.

ఓటు కోసం.. ఆట పాటలు

- కళాకారులతో ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల పాట్లు

కర్నూలు (అర్బన్), ఏప్రిల్ 24: జిల్లాలో రాజకీయ పార్టీల ప్రచార సందడి జోరందుకుంది. గోడ రాతలు, పోస్టర్లు, కరపత్రాలు, సభలు సమావేశాలకు తోడు ప్రత్యేక గీతాలతో పార్టీలు, అభ్యర్థుల గుణ, గణాలు, హామీలు, పథకాలు వంటి వాటితో ప్రత్యేక పాటలను రికార్డు చేయించారు. జనాల మధ్య పాటల్ని ప్రచార సాధనాలుగా వినియోగిస్తున్నారు. విభిన్నమైన ప్రచార సాధనాలు వినియోగిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ నేటితో ప్రారంభం కావడంతో క్రమంగా ప్రచార పర్వాన్ని ఉధృతం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ఆయా అభ్యర్థులు తమ పార్టీల పథకాలను గుర్తుకు తెచ్చేలా పాటలను ప్రత్యేకంగా కంపోజ్ చేయించి రికార్డు చేశారు. ఈ పాటల్ని డిజిటల్ విధానంలో లౌడ్ స్పీకర్లలో ఆకట్టుకునే సంగీతంతో ప్రజలకు వినిపించేందుకు ప్రత్యేకంగా



వాహనాలను తయారు చేశారు. సభలు, సమావేశాలు జరిగిన సందర్భాల్లో పలువురు గాయకులతో ఆకట్టుకునే విధంగా పాటలు పాడించడం, కళాకారులచే ప్రదర్శనలు ఇప్పించడం వంటివి చేస్తున్నారు.

ప్రధానంగా కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ప్రత్యేకంగా తను ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబందించి పాటలు పాడించడమే కాకుండా వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

- **కళాజాతా బృందాల బీజీ :** ఈ సారీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు బరిలో ఉంటున్నారు. ఒక్కో పార్టీకి మూడు కళాజాతా బృందాలు అవసరం ఉంటున్నాయి. నియోజకవర్గంలో అభ్యర్థి వెంట ఒక బృందం, మిగతా రెండు బృందాలు ఇతర మండలాల్లో ప్రచారం చేస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రవేశ పెట్టిన పథకాలు ఇచ్చే హామీలు ప్రజల్లోకి చేరువ చేసేందుకు కళాజాతా బృందాలు శ్రమిస్తున్నాయి. ఎన్నికల పుణ్యమా అంటూ వారికి కూడా ఉపాధి లభించినట్లయింది.
- **ప్రతీ పాటకూ లెక్కే..!**

ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా తమ పేర్లతో కూడిన పాటలను రికార్డు చేయించుకున్నారు. తమపేర్లు వచ్చేలా కనీసం మూడు నుంచి 6 పాటల దాకా రాయించి ప్రత్యేక సంగీతంతో ఆకట్టుకునేలా రికార్డు చేయించారు. ఇక ఆయా పార్టీల అధిష్ఠానం ఇచ్చే పాటలు అదనం. ఇందులో సాహిత్యం మొత్తం పార్టీ పథకాలను సూచించే విధంగా ఉంటున్నాయి. ప్రత్యేకంగా వీటి కోసం ఆరు నుంచి ఎనిమిది పాటలు సిద్ధం చేశారు. ఇక ఈ పాటలను ఎల్ఈడీ తెరపై వీడియోలు జత చేస్తూ ముస్తాబు చేశారు. పాటల రచయిత, సంగీతం, దర్శకుడు, స్టూడియో, వాయిద్య కళాకారులు, గాయకులు. వీడియో ఎడిటింగ్ కలిసి మొత్తం ఖర్చు చెల్లించాల్సి ఉంటుందిచీటి లేకున్నా వివరాలు తెలుసుకోవచ్చు

ఎన్నికల ప్రక్రియలో అధికారులే కీలకం

- ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు..



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 24: ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర చాలా కీలకం. అంతకుముందు వరకు ప్రభుత్వ ఆధీనంలో ఉండే అధికారులు ఒక సారి ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిందంటే.. వెంటనే ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లిపోతారు. ఓటరు నమోదు నుంచి మొదలు పెడితే.. ఎన్నికల ప్రక్రియ పోలింగ్, లెక్కింపు ఇలా అన్ని బాధ్యతలు వారివే.. వివిధ స్థాయిలో వారి వారి విధులను నిబద్ధతతో పూర్తి చేస్తారు.

జిల్లా ఎన్నికల అధికారి: జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ అంతా వారి పర్యవేక్షణలో జరుగుతుంది. అధికారులకు విధులు కేటాయింపు మొదలుకుని వారికి శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు కలెక్టర్ ప్రధాన బాధ్యత వహిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో): ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. ఆర్వో తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, తిరస్కరణ అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణతో పాటు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి వరకు ఆర్వోదే బాధ్యత.

సెక్టోరియల్ అధికారి(ఎస్ఓ): పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించే విదంగా చూస్తారు. ఒక సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాలలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారిదే బాధ్యత.

ప్రిసైడింగ్ అధికారి(పీఓ): ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒకప్ర ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎం ఇతర సామగ్రిని తీసుకువస్తారు. ఆయనకు కేటాయించిన పోలింగ్ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనపై ఉంటుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. ప్రిసైడింగ్ అధికారికి సహాయంగా అడిషనల్ ప్రిసైడింగ్ అధికారి కూడా ఉంటారు. వీరితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలు పని చేస్తున్నాయా..? లేదా..? ప్రిసైడింగ్ అధికారి చూడాల్సి ఉంటుంది.

పూల వ్యాపారులకు భలే గిరాకీ

- నాడు పూలదండలైతే.. నేడు అన్నీ గజమాలలే..
- ఒక్కోటి రూ.20 వేల నుంచి రూ.30 వేలు
- కాసిది అభిమానం.. కాసిది వ్యాపారం



గోనెగండ్ల, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో పూల వ్యాపారులకు భలే గిరాకీ ఉంది. వేల రూపాయల్లోనే వ్యాపారం జరుగుతోంది. ఒక్క గజమాల రూ. 20వేల నుంచి రూ. 30 వేల వరకు ధర పలుకుతోంది. పోటీ చేసిన అభ్యర్థులు గ్రామానికి వచ్చారంటే ఆయా గ్రామాల నాయకులు తప్పనిసరిగా తమ నేతకు గజమాల వేస్తున్నారు. దీంతో వ్యాపారులకు ప్రతి రోజూ వేల రుపాయల వ్యాపారం జరుగుతోంది. గతంలో గ్రామాలకు వచ్చే నాయకులకు దీనికితోడు గజమాల వేసేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకుగాను గంటకు రూ.1000 బాడుగకు మాట్లాడి జీపుపై ఉన్న తమ నేతలకు గజమాలను వేస్తున్నారు. పూల వ్యాపారులు మాత్రం ఇదే మంచి తరుణమని వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. సగాని సగం వరకు లాభం వస్తుందని వ్యాపారులు తెలుపుతున్నారు.

మాట తప్పారు..



అట్లుంటది అన్నతోని..

తుగ్గలి, ఏప్రిల్ 24: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో మాట తప్పను.. మడమ తిప్పను.. అని చెబుతూనే సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారు. ఆరు నెలల క్రితం పత్తికొండలో రైతుభరోసా డబ్బులు ఖాతాలో జమ చేసేందుకు బటన్ నొక్కడానికి వచ్చిన సీఎం జగన్ మారెళ్ల, బొందిమడుగుల రహదారిని మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కనీసం ఆ బ్రిడ్జి వైపు అధికారులెవరూ కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో వంక దారిలో వెళ్తూ కిందకు పడుతూ లేస్తూ ప్రమాదాలకు గురవుతూ ప్రయాణాలు చేస్తున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించకపోవడంతో నేరుగా సీఎం జగన్‌కు విన్నవించారు. నిండు సభలోనే వెంటనే ఆ కల్వర్టు పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే శ్రీదేవి కూడా రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అయితే.. ఇప్పటి వరకు ఆ కల్వర్టు వైపు ఒక్క అధికారి, పాలకులు కూడా కన్నెత్తి చూడలేదు.



బొందిమడుగుల, మారెళ్ల గ్రామాల మధ్య కూలిపోయిన ప్రధాన రహదారిలోని బ్రిడ్జి

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు: శబరి



కలమందలపాడులో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

మిడుతూరు, ఏప్రిల్ 24: యువత భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ రావాలని నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని కలమందలపాడు, మాసపేట, కడుమూరు గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులకు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మాయ మాటలు చెప్పి ఉద్యోగాలు భర్తీ చేయకుండా జగన్ యువతను మోసం చేశారని ఆరోపించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలనికోరారు. తువ్వా భగీరథ రెడ్డి, గుండం స్వామి రెడ్డి, బాబు, రమణయ్య, వీరా రెడ్డి, రామసుబ్బా రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో రైతులకు అన్యాయం: బైరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

పాణ్యం, ఏప్రిల్ 24: జగన్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆరోపించారు. బుధవారం బలపనూరులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బైరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టులు గానీ, పరిశ్రమలు గానీ చేపట్టలేదన్నారు. దీంతో రైతాంగం, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయలేదని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులే రైతులకు ఊపిరి అన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణ పూర్తికి అవసరమైన వంద కోట్లరూపాయలు మంజూరు చేయకపోగా నిర్మాణం శిథిలమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రిపేరీలకూ నిధులు మంజూరు చేయలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలోనే ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతంగా సాగాయన్నారు. పోలవరం, గోదావరి ఎత్తిపోతల, అవుకు తదితర ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతంగా జరిగాయన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డికి చెందిన భారతీ సీడ్స్‌లో అంతా అక్రమాలే అన్నారు. కల్తీ విత్తనాలు పంపిణీ చేసి రైతులను నట్టేట ముంచారని ఆరోపించారు. నంద్యాల టీడీపీ ఎంపీగా పోటీ చేస్తున్న బైరెడ్డి శబరి తోపాటు అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లాలోని అన్ని వర్గాల సమస్యలపై గురువారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, తదితర వర్గాలు హాజరు కావాలని కోరారు. గోరుకల్లు, బలపనూరు, పాణ్యం గ్రామాలకు చెందిన రైతులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి



చర్మిళ



రిషిత



కార్తీక్




గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్‌లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్‌ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తం రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

అటవీ శాఖలో ఉద్యోగినులపై వేధింపులు?

ఆత్మకూరు, ఏప్రిల్ 24: ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఓరేంజ్‌కు చెందిన కీలక అధికారి తన రేంజ్ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను వేధిస్తున్నట్లు విమర్శలు వచ్చాయి. ప్రత్యేకించి మహిళా ఉద్యోగినులతో డబుల్ మీనింగ్ మాటలతో దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం మహిళా ఉద్యోగులనే మర్యాద కూడా లేకుండా విధినిర్వహణకు సంబంధించి మహిళా ఉద్యోగులను ఏం పీకుతున్నావ్.. నైట్ డ్యూటీలకు వెళ్లి ఎక్కడ పడుకుంటున్నారు? ఫారెస్టు బీట్‌లను రెడ్‌లైట్ ఏరియాగా మార్చేశారంట కదా? అంటూ డబుల్ మీనింగ్ కించపరిచినట్లు ప్రచారం జరుగుతోంది. సెలవులు కోరినా మంజూరు చేయకుండా లేనిపోని మాటలతో మనోవేదనకు గురిచేసేవాడని తెలిసింది. అంతేకాదు పురుష ఉద్యోగులను కూడా పత్రికల్లో రాయలేని విధంగా బూతులు తిడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అధికారి దురుసు ప్రవర్తనను తట్టుకోలేని కొందరు మహిళా ఉద్యోగులు ఇటీవల ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన సదరు అధికారిని పిలిపించి మందలించినట్లు సమాచారం. ఈవిషయంపై ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాను వివరణ కోరగా ఉద్యోగినులు ఫిర్యాదు చేయడం వాస్తవమేనని చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నామని, అధికారిని పిలిపించి ఇలాంటివి పునరావృతం కాకూడదని మందలించినట్లు తెలిపారు.



ఆంధ్రజ్యోతి

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్. షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**

AJA- 176988

CHANGE OF NAME

I, **Bongu Jabin** (old name) W/o Gani Mohammed Tasleem, D.no. 11-161, Reddy Peta, Sirvel, Kurnool Dist. I have changed my name to **SHAIK GANI JABIN** (new name) W/o Gani Mohammed Tasleem, hence forth I may be called as **SHAIK GANI JABIN** for all purposes.

AJA-189404

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, దీని వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ / యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

అట్టహాసంగా గౌరు చరిత నామినేషన్

- వేలాది మంది కార్యకర్తలతో భారీ ఊరేగింపు, బలప్రదర్శన
- కదంతొక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- వైసీపీ దోపిడీ నాయకులకు బుద్ధి చెప్పండి: గౌరు చరిత



నామినేషన్‌కు తరలివచ్చిన వేలాదిమంది కార్యకర్తలు



నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ పాణ్యం నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మోగా సిరి ఫంక్షన్‌హాల్లో గౌరు దంపతులు, కూటమి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల, కల్లూరు రూరల్, అర్బన్ నుండి వేలాదిగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. మోగా సిరి ఫంక్షన్‌హాల్ నుండి అశేష జనవాహిని తరలిరాగా గౌరు దంపతులు అభివాదం చేస్తూ భారీ ఊరేగింపు చేశారు. తప్పెట్లు, డోలు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, డీజే పాటలతో కర్నూలు నంద్యాల ప్రధాన రహదారి పసుపుమయంగా దర్శనమిచ్చాయి. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జనసేన నాయకుడు చింతా సురేష్, బీజేపీ నాయకుడు నాగరాజు కూటమి నాయకులతో కలిసి గౌరుచరిత జేసీ చాంబర్‌లో పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

టీడీపీ కూటమిదే విజయం : గౌరు చరిత

నామినేషన్ అనంతరం మీడియా పాయింట్ వద్ద గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించడానికే కూటమి ఏర్పడిందని, జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యమని అన్నారు. పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ వందశాతం గెలవబోతోందని అన్నారు. నియోజకవర్గంలో కబ్జాలు చేసి, ఎర్రమట్టి తవ్వకాలతో దోచుకుతిన్న నాయకులను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.



టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి వెళ్తున్న గౌరు చరిత

వైసీపీ పాలనలో ముస్లింలకు ద్రోహం: బుడ్డా



మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



వెలుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న బుడ్డా శైలజ

ఆత్మకూరు, ఏప్రిల్ 24: వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీ తీరని ద్రోహం జరిగిందని శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. ఈమేరకు మంగళవారం ఆత్మకూరు పట్టణ వైసీపీ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ సోదరుడైన ఎస్. హాషం ఆధ్వర్యంలో 60 ముస్లిం మైనార్టీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. అనంతరం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుడ్డా మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచే ముస్లింల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. ప్రత్యేకించి దుకాన్ మకాన్, దుల్హన్ పథకం, విదేశీ విద్య, షాదీఖానా నిర్మాణాం, హజ్‌యాత్రకు చేయూత, రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ రుణాల పంపిణీ, ఇమామ్, మోజన్‌లకు వేతనాలు, ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలు, ఇలా అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీదేనని గుర్తుచేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయా పథకాలన్నింటినీ రద్దు చేసి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎన్నికల ముందు అమలుకాని హామీలు గుప్పించి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వాటన్నింటిని గాలికి వదిలేశారని విమర్శించారు. తాను ఎంతో కష్టపడి సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయిస్తే కనీసం పంటకాల్వలను నిర్మించలేదని మండిపడ్డారు. అలాగే ఆత్మకూరులో శాశ్వతంగా తాగునీటి సమస్యను తీర్చేందుకు నాన్ అమృత్ స్కీం కింద రూ.119కోట్లతో పనులను ప్రారంభిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక పనుల్లో పురోగతి లేకుండా పోయిందని అన్నారు. అదేవిధంగా ఆత్మకూరు, వెలుగోడు, గాజులపల్లిలోని షాదీఖానాల నిర్మాణాలకు తాను సుమారు రూ.3కోట్లకు పైగా నిధులు మంజూరు చేయిస్తే ఆపనులు ముందుకు సాగలేదని వివరించారు. ప్రత్యేకించి ఆత్మకూరులో రూ.2.2కోట్లు నిధులను మంజూరు చేయిస్తే ఎన్నికల కోసమని హడావిడిగా రేకులతో నిర్మాణాన్ని పూర్తిచేశారని మండిపడ్డారు. తన సోదరుడు బుడ్డా సీతారామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆత్మకూరులో 132 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇళ్లపట్టాలు పంచామని, అయితే అవే భూములను తిరిగి పంపిణీ చేసి జగనన్న కాలనీలని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అదేవిధంగా తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2500 గృహాలను లబ్ధిదారులు నిర్మించుకున్నారని ఒక్కో ఇంటికి రూ.2.5లక్షలు సాయం అందించిన ఘనత టీడీపీదేనని అన్నారు. ఇకపోతే 40ఏళ్లలో ఎన్నడూ లేనిది మసీద్ నిర్మాణంలో కలిసిమెలిసి ఉన్న ప్రజల్లో చిచ్చురేపి హిందూ, ముస్లిం గొడవలకు కారణమయ్యారని ఆరోపించారు. ఎమ్మెల్యే శిల్పా నీచ రాజకీయాల వల్లే అమాయక హిందూ, ముస్లింలు జైలు పాలయ్యారని అన్నారు. ఇలాంటి నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, కలిముల్లా, వేణుగోపాల్, నాగూర్‌ఖాన్, అబ్దుల్లాపురం బాషా, షాబుద్దిన్, పస్పేల్‌మున్నా తదితరులు ఉన్నారు.



బుడ్డా సమక్షంలో టీడీపీలోకి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు

- ఆత్మకూరు పట్టణంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. ఆత్మకూరు మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు మోమిన్ ఫాతిమా, ఆమె భర్త వైసీపీ నాయకులు మోమిన్ షాకీర్, మాజీ వార్డు సభ్యులు మోమిన్ జాకీర్‌హుసేన్‌తో పాటు మరో 40కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలోకి చేరాయి.

వెలుగోడు: రాష్ట్రంలో టీడీపీ తోనే మహిళల సాధికారత సాధ్యమని శ్రీశైల నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బుడ్డారాజశేఖరరెడ్డి సతీమణి బుడ్డా శైలజ అన్నారు. బుధవారం ఆమె వెలుగోడు పట్టణంలోని మండ్ల పేట, జెండా పేట, సుంకులమ్మవీధి, ఈడిగ పేటలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: జయసూర్య



చెరుకుచెర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య



ప్రచారం చేస్తున్న మాండ్ర లింగారెడ్డి

మిడుతూరు, ఏప్రిల్ 24: చంద్రబాబు వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం మండలంలోని చెరుకుచెర్ల గ్రామంలో సర్వోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. మండల కన్వీనర్ కాతా రమేశ్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, శివరామి రెడ్డి, శేఖర్, వతి, ఇద్రూస్, రెహమాన్, రఫి, మగ్బూల్ అహమ్మద్, భూషణం, ఆనందం, స్వాములు, వెంకటరత్నం పాల్గొన్నారు.

నందికొట్కూరు: రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ నాయకుడు మాండ్ర లింగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డు ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, లింగమయ్య ఆధ్వర్యంలో లింగారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలతో మహిళార్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. టీడీపీ నాయకులు మాండ్ర విష్ణు మోహన్‌రెడ్డి, మాండ్ర పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, ముర్తుజావలి, సురేష్, వేణుగోపాల్, షకీల్ అహ్మద్, శాంతరాజు, దావీదు, మీనాక్షిదేవి తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక వృద్ధులకు పింఛన్‌ను రూ.4 వేలు చేసి ఇంటి వద్దకే వచ్చి ఇచ్చే ఏర్పాటు చేస్తామని టీడీపీ నాయకులు మాండ్ర లింగారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 10వ వార్డులో ఆయన ప్రచారం నిర్వహించారు. పింఛన్ 200 నుంచి రూ.2000 చేసింది చంద్రబాబే కదా నాయన అని వృద్ధురాలు అన్నారు.
- టీడీపీ అభ్యర్థి జయసూర్య మూడు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. టీడీపీ తరపున బండి జయరాజు సమర్పించారు. జయసూర్య వెంట మాండ్ర లింగారెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు దామోదర్‌రెడ్డి, రవి ఉన్నారు.



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న జయసూర్య

టీడీపీతోనే ఉద్యోగావకాశాలు: ఫరూక్

గోస్పాడు, ఏప్రిల్ 24: టీడీపీతోనే యువతకు ఉద్యోగావకాశాలు సాధ్యమని నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం శ్రీరామ్‌నగర్, పసురుపాడు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ పుండరికాంక్షరెడ్డి, తులసిరెడ్డి, పేరయ్యచౌదరి, పీరా భాస్కర్, పీరా వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బొపిటి మహేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఫరూక్

నంద్యాల (నూనెపల్లె): నియోజకవర్గంలో ఏ వార్డు కెళ్లినా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సమస్యలు చెబుతున్నారని, వైసీపీ పాలనలో ఏమి అభివృద్ధి చేశారని టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్‌ఎండీ ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ ప్రశ్నించారు. బుధవారం నంద్యాలలోని 13వ వార్డులో మాజీ కౌన్సిలర్ మధుసాయి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నంద్యాలలోని రెండోవార్డు, మూడోవార్డు నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు. బుధవారం టీడీపీలో చేరిన వారికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫరూక్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

'పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం'

నంద్యాల టౌన్, ఏప్రిల్ 24: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అసంపూర్తిగా ఉన్న సాగు నీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుటుందని నంద్యాల ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం రెండవ సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అంతకు మునుపు డీసీసీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనల కార్యక్రమాన్ని నిర్వహించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, ఆళ్ళగడ్డ అభ్యర్థి హుసేన్ బాషా, శ్రీశైలం అభ్యర్థి ఇస్మాయిల్, బనగానపల్లె అభ్యర్థి జి.పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య పాల్గొన్నారు.



సర్వమత ప్రార్థనలో లక్ష్మీనరసింహ యాదవ్

వేలం పాటలు వాయిదా

మహానంది, ఏప్రిల్, 24: మహానందిలో బహిరంగ వేలాలు బుధవారం ఆరోసారి వాయిదా పడినట్లు ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కొబ్బరి చిప్పలను పోగు చేసుకునే హక్కుతోపాటు, నవగ్రహ మండపం వద్ద భక్తులకు దీపాలు సరఫరా చేసే హక్కు, వాహనాల పూజ నిర్వహించే హక్కు, జిందాల్ సంస్థ నూ తనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని చెప్పారు. సీల్ టెండర్ల ద్వారా అనుకున్నంత స్థాయిలో ఆదాయం రాలేదన్నారు. అయితే గోశాల వద్ద ఏడాదిపాటు ఎరువును సేకరించేందుకు మహానందికి చెందిన కాశీ విశ్వనాథ్ రూ.44,400 హెచ్చుపాట పాడి దక్కించుకొన్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, నాగమల్లయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుకు భారీ జరిమానా



ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్(రూరల్), ఏప్రిల్ 24: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఆర్టీవో అధికారులు బుధవారం గుజరాత్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్న ప్రైవేటు బస్సును తనిఖీ చేశారు. ఈ బస్సుకు ప్లేట్ నెంబరును మార్చి, రోడ్డు ట్యాక్స్‌లు, పర్మిట్లు లేకుండా తిరుగుతున్నట్లు గుర్తించామని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ బస్సు గుజరాత్ నెంబర్‌ప్లేట్‌తో రోడ్డుపై తిరుగుతుందని సీజ్ చేసి రూ.2,44,500 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

● **అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు :** టూ వీలర్స్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. టూ వీలర్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై పట్టణంలోని రెండు టూ వీలర్స్ షోరూమ్‌లను ఆర్టీవో తనిఖీ చేసి పత్రాలు, రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. నిబంధనల మేరకే టూ వీలర్స్ విక్రయాలు చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

చాగలమర్రి, ఏప్రిల్ 24: చాగలమర్రి గ్రామంలోని టోల్ ప్లాజా వద్ద ఉన్న జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ రమణయ్య మాట్లాడుతూ వాహనాల్లో నగదు, అక్రమ మద్యం, తరలించరాదని, పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ, పోలీసులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థకు విరాళం

బేతంచెర్ల, ఏప్రిల్ 24: పట్టణంలోని ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు వన్నూరు బాషాకు బృందావన్ భారత్ గ్యాస్ ఏజెన్సీ యజమాని బుగ్గన రమణారెడ్డి రూ.20వేలు విరాళంగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బుగ్గన రమణారెడ్డి మాట్లాడుతూ ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను చూసి తన వంతు బాధ్యతగా రూ.20వేలు నగదును అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆల్తాఫ్, రాఘవేంద్ర, మాబాషా పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 24: మండలంలో ఉపాధి పనులు చేసే కూలీలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధి ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం పెద్దబోదనం గ్రామంలో చెక్‌డ్యామ్‌లో చేస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు. వడదెబ్బ గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

రాంకో సిమెంట్ వ్యవస్థాపకుడి జయంతి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 24: రామ్‌కో సిమెంట్ వ్యవస్థాపకుడు రామస్వామి రాజా 130వ జయంతి సందర్భంగా కొలిమిగుండ్ల శివాలయం నుంచి రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లాంట్ హెడ్ రెడ్డినాగరాజు, పరిపాలనాధికారి రామరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to **రుద్రవీర్ ఆచారి, తండ్రి : వెంకటసుబ్బయ్య ఆచారి, H.No: 9-164, నంద్యాల రోడ్, పెద్దచింతకుంట గ్రామం, ఆళ్లగడ్డ మం.** by keeping the below mentioned propertie of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mort gages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

Sy.No. 338/2 Pyki
Extent: 173.13 చ.గ.లు, 612.15 చ.అ.లు

BOUNDARIES: **తూర్పు** :రోడ్డు, **పడమర:** నా తాలూకు మిగులు స్థలం, **ఉత్తరం** : పొరెడ్డి నాగిరెడ్డి రేకుల షెడ్డు, **దక్షిణం** : పొరెడ్డి నాగిరెడ్డి రేకుల షెడ్డు.

T.V. PRASAD
Advocate, Nandyal.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Nandyal. I issue the following notice to general public. My Clients intends to grant loan to **దూదేకుల బీబీ, భర్త : హుస్సేని, H.No:2-167, దేవరాయపురం గ్రామం, ఆళ్లగడ్డ.** by keeping the below mentioned propertie of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mort gages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

Sy.No. 412, 413
Extent: 6 సెంట్లు

BOUNDARIES: **తూర్పు** :ఈ దినం నేను చిన్న అచ్చమ్మ గారి రమేష్‌కు విక్రయించిన స్థలం, **పడమర:** 21 అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం** : నా తాలూకు స్థలం, **దక్షిణం** : ఈ దినం నేను తమ్ముడపల్లె మధుకుమార్‌కు విక్రయించిన స్థలం.

T.V. PRASAD
Advocate, Nandyal.

ఆంధ్రజ్యోతి

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**

AJA- 176988

CHANGE OF NAME

I, **Bongu Jabin** (old name) W/o Gani Mohammed Tasleem, D.no. 11-161, Reddy Peta, Sirvel, Kurnool Dist. I have changed my name to **SHAIK GANI JABIN** (new name) W/o Gani Mohammed Tasleem, hence forth I may be called as **SHAIK GANI JABIN** for all purposes.

AJA-189404

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటన దారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ / యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఐడివిటి

నవరత్నాలు.. నవ మోసాలు

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 24: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు నవమోసాలు అయ్యాయని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేట వీధిలో బుధవారం ప్రజాగళం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. బీసీకి తెలుగుపేట వాసులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బీసీ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ నవరత్నాలు అంటూ డప్పు కొట్టి ఎన్నికల్లో గెలిచి నవరత్నాలు నవమోసాలుగా మార్చారని విమర్శించారు. అమ్మవడి కింద రూ.15వేలు ఇస్తామని రూ.13వేలు ఇచ్చి మోసం చేశారన్నారు. ప్రతిపథకంలో అర్హులైన వారిని ఏదో ఒక కుంటిసాకులు, నిబంధనలతో ప్రజలను నయవంచన చేసిన సైకో సీఎం జగన్ అని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు : బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి బీటలు పడుతున్నాయి. అవుకు మండలం కొండమనాయినిపల్లె, జోలాపురం, బనగానపల్లె, పెట్రికోటకు చెందిన పలు వైసీపీ కుటుంబాలవారు టీడీపీలో చేరారు. అవుకు మండలం కొండమనాయినిపల్లెకు చెందిన పలువురు వైసీపీ నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. అలాగే హుసేనాపురానికి చెందిన జహంగీర్ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణానికి చెందిన ఫజిల్‌ఆలీబేగ్, పెయింటర్ జహంగీర్, బబ్లు, సాగర్, సమద్, చాంద్‌బాషా తదితర 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బీసీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే బనగానపల్లె మండలం జోలాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్లమద్దిలేటిరెడ్డి కుమారుడు నర్ల మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడిపాటి మద్దిలేటి, బాలమద్దిలేటి, నీలి మద్దిలేటి, మధుబాబు, దస్తగిరి తదితరులు టీడీపీలో చేరారు.

పెట్నికోటలో.. కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు ఐవీ పక్కీర్‌రెడ్డి, జంగిటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, పెద్దరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కుమ్మెత్తరామిరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

రైతులను దగా చేసిన ప్రభుత్వం: బీసీ ఇందిరమ్మ

సంజామల: రైతులను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం సంజామల మండలం మంగపల్లె గ్రామంలో ప్రజాగళం కార్యక్రమంలో బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. ఆమె ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను గ్రామస్థులకు వివరించారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో రైతులు సాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బంది పడ్డా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జలయజ్ఞం పేరుతో రైతులను దారుణంగా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.





టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, సంజామల మండలం మంగపల్లెలో ప్రజాగళంలో ప్రసంగిస్తున్న బీసీ ఇందిరమ్మ

డ్వాక్రా మహిళలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షలు

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 24: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రా మహిళలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షలు రుణాలు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. బుధవార రాత్రి మండలంలోని కొత్తకోట గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, సీఎం శ్రీనివాసులు, గంధం శ్రీనివాసులు పాల్గొన్నారు. డోన్ టీడీపీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్, సీనియర్ న్యాయవాది హనుమంతరెడ్డి కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా డోన్ మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బత్తిన జయరాముడు, మల్లయ్య, జనార్దన్, మల్లికార్జున, బంగారు రాజుతోపాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

నామినేషన్ వేసిన కోట్ల సుజాతమ్మ : డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సుజాతమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, భాస్కర్ రెడ్డి, ఓంప్రకాష్‌లతో కలిసి ఆమె నామినేషన్ దాఖలు చేశారు.

మహిళపై దాడి.. ఐదుగురిపై కేసు

రుద్రవరం, ఏప్రిల్ 24: మండల కేంద్రమైన రుద్రవరంలో దారువాడ బన్రునబీ అనే మహిళపై బుధవారం అదే వీధికి చెందిన ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. ట్రాక్టరు తీయమన్న విషయంలో దాడి చేశారు. బన్రునబీ ఫిర్యాదు మేరకు మహాలక్ష్మి, వీరన్న, వి.మహాలక్ష్మి, వెంకటేశ్వర్లు, తిరుమలమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

అట్టహాసంగా కోట్ల నామినేషన్

» వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు



కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్‌కు వెళ్తున్న కోట్ల

డోన్, ఏప్రిల్ 24: డోన్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా టీడీపీ తరఫున కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కోట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతకుముందు కోట్ల తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల రాఘవేంద్రరెడ్డి, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, కోట్ల నివేదిత, కోట్ల చిత్రమ్మ, మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్ తదితరులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. వేలాదిమంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గ ప్రాంతం కరువు ప్రాంతమని, రైతులకు చెరువులకు సాగునీరు నింపి రైతుల జీవితాలు మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వలసల రామక్రిష్ణ, కోట్రికే ఫణిరాజ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, మాజీ ఎంపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మల్రిరమణ, కోట్ల గిరిధర్ రెడ్డి, శ్రీనివాసభట్, ధర్మవరం భరత్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, నాయకులు తిమ్మయ్య, శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, సుధీష్, ఎల్లనాగయ్య, ఓంప్రకాష్, రంజిత్ కిరణ్, పరమేష్, రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివ, చక్రపాణి, వలసల బాలుడు, అన్వర్‌భాషా, ఎస్ఎండీ రఫీ, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో ర్యాలీగా వెళ్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, కార్యకర్తలు

విజయవాణిలో ఉత్తమ ఫలితాలు



వైష్ణవి



చర్మిళ



రిషిత



కార్తీక్



గణేష్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 24: చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం విజయవాణి నగర్ లోని విజయవాణి పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 99.10శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నాయని చంద్రశేఖర్‌మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 111మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 110మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.వైష్ణవి 583 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. జి.చర్మిళ 577, ఎం.గణేశ్ 571, ఎం.కార్తీక్ 571, ఎం.రిషిత 572 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో 36 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి



గరుడ వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

బేతంచెర్ల, ఏప్రిల్ 24: పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ఈ ఊరేగింపు దేవస్థానం నుంచి గౌరిపేట హనుమాన్ నగర్, సంజీవనగర్, బోయపేట మీదుగా కూరగాయల మార్కెట్ నుంచి దేవస్థానం చేరుకుంది. భక్తులు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మద్దిలేటి, బుగ్గన విశ్వనాథరెడ్డి, పుల్లారెడ్డి, మారుతి కృష్ణ శర్మ, సుబ్బారెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి

బనగానపల్లె, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని బనగానపల్లె టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం అవుకు మండలం గుండ్లసింగవరం గ్రామంలో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దళితుల మద్దతు టీడీపీకే

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 24: దళితుల మద్దతు టీడీపీకే ఉంటుందని మాలమహానాడు అధ్యక్షుడు కోగిల ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉయ్యాలవాడ, దొర్నిపాడు, రుద్రవరం మండలాల నుంచి మాలమహానాడు నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా కోగిల ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులపై ఎన్నో దాడులు జరిగాయన్నారు. చంద్రబాబు ఇచ్చిన ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ లోన్లను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదాం, సుధాకర్, మద్దిలేటి, పుల్లయ్య, లాజర్, జయన్న, మహేశ్ పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 24: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామ, పట్టాభిరామ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా మహిళలు సామూహికంగా 108 దీపాలు వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సీతారాముల పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవాని, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బాలిరెడ్డితో బీసీ జనార్దన్‌రెడ్డి భేటీ



బాలిరెడ్డితో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 24: వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవికి ఇటీవల రాజానామా చేసిన ఇటిక్యాల బాలిరెడ్డితో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ధన్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాలలో బాలిరెడ్డి స్వగృహంలో బాలిరెడ్డితో పాటు, ఆయన కుమారులు శివరెడ్డి, మదన్ రెడ్డిలను బీసీ కలిశారు. ఈసందర్భంగా టీడీపీలోకి రావాలని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని బీసీ బాలిరెడ్డిని కోరారు. త్వరలోనే టీడీపీలో చేరుతానని బాలిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మిరెడ్డి, పులి ప్రకాశరెడ్డి, ఉలువల నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 24: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో సాయికిష్ణ, ఏఎస్ఐ నాయక్ అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా మండల క్రేంద్రమైన కొలిమిగుండ్లతో పాటు, మండలంలోని పలు గ్రామాలలో వారు పర్యటించారు. పార్టీలకు సంబంధించిన జెండాలు, శిలాఫలకాలు, నేతల విగ్రహాలపై తప్పనిసరిగా ముసుగు వేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా శిలాఫలకాలు, విగ్రహాలపై ముసుగులు తొలగితే తిరిగి వాటిని కప్పి వేయాలని ఆదేశించారు.

రుద్రవరం: మండలంలో ప్రతి ఉద్యోగి ఎన్నికల కోడ్‌కు లోబడి విధులు నిర్వర్తించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దొర్నిపాడు, ఏప్రిల్ 24: మండలంలోని దొర్నిపాడులోని చాకలి బావి వద్ద గ్రామ పెద్దలు, రజకుల ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అర్చకులు ఇంద్రగంటిశర్మ గంగమ్మకు పూజలు చేశారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ : మండలంలోని దొర్నిపాడులో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ బుధవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. సాయి సేవకులు నాగరాజు, ఎం. నర్సప్ప, వై.రాంప్రకాష్, అర్చకులు పూజలు నిర్వహించారు.

ఘనంగా 'స్వాతి' వేడుకలు



దిగువ అహోబిలంలో స్వాతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 24: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళ వారం వేదపండితులు స్వాతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు సన్నిధిలో సుదర్శన హోమాన్ని వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. భక్తులు నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొని సుదర్శన హోమంలో పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

11 మంది నామినేషన్ దాఖలు

బనగానపల్లె, ఏప్రిల్ 24: బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం 11 మంది నామినేషన్ దాఖలు చేసినట్లు బనగానపల్లె రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు బుధవారం తెలిపారు. టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్ రెడ్డి, వైసీపీ అభ్యర్థులుగా కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గూటం పుల్లయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అంబటి రవికుమార్‌రెడ్డి, ఆకుల వెంకటనాగిరెడ్డి, ఆందనం దేవరాజు, కొప్పెట వెంకటశివారెడ్డి, ఎల్లాల రామచంద్రారెడ్డి, తలారి వెంకట శ్రీనివాసులు, ఈడిగ గురుప్రదీప్‌లు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.

శోభా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయం



శోభానాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఏప్రిల్ 24: దివంగత ఎమ్మెల్యే భూమా శోభా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, సల్లా నాగరాజు, జెట్టి నాగరాజు అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో శోభానాగిరెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు అనిఫ్, మాబులాల్, ముల్లా శ్యాబుల్, అజీమ్, కరిముల్లా, గఫార్, అబ్దుల్ ఖాదర్, ఖలీల్, టైలర్ మదార్‌సా, ఆవుల ప్రతాప్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్ళ పాలనలో పేదప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. అంతేకాకుండా పెట్రోల్, డీజల్, బస్సు చార్జీలు, వంటగ్యాస్, ధరలతో పాటు నిత్యావసర ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, డాక్టర్ శ్రీధర్ రెడ్డి , రమణయ్య , మైనార్టీ నాయకుడు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 24: అదనపు కట్నం కోసం ఓ మహిళను భర్త, అత్త వేధింపులకు గురి చేయడంతో వాళ్లిద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన శ్రీనిధిని గుంతకల్లుకు చెందిన తేజ్ కుమార్‌తో 2019లో వివాహం జరిపించారు. వీరి దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా సాగింది ఇటీవల భర్త తేజ్‌కుమార్, అత్త ఇద్దరు కలిసి అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నారని కోవెలకుంట్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాగలమర్రి, ఏప్రిల్ 24: చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలి పారు. చాగలమర్రి గ్రామంలోని మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి కడప జిల్లా కూలూరు గ్రామానికి ఓ వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: అఖిలప్రియ

శిరివెళ్ల, ఏప్రిల్ 24: పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా మండలంలోని బోయలకుంట్ల, చెన్నూరు గ్రామాల్లో బుధవారం రోడ్‌షో నిర్వహించారు. వైసీపీ పాలనలో వెనుకబడిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాం త్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని బీరవోలు, యల్లావత్తుల, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, కొండమాయపల్లె గ్రామాల్లో బుధవారం రాత్రి ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలపై సీఎం బొమ్మ ఎందుకు అప్పుల కోసమేనా అన్నారు. కార్యక్రమంలో ఆలమూరు నారాయణ, గురుమూర్తి, బాచుపల్లె నారాయణ, లక్ష్మీకాంత్, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్, మాజీ సర్పంచ్ ఎర్రం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.